# జర్మనీ | రోజురోజుకూ పెరిగిపోతున్న తీవ్ర అభివృద్ధి నిరోధక మితవాదం

**ఒకనాడు** ప్రపంచమంతటికీ ముప్పుగా, ప్రపంచ ప్రజానీకానికి శాపంగా పరిణమించిన జర్మనీ నాజీ ముష్కర హంతకుల, తీవ్ర అభివృద్ధి నిరోధక మితవాద రాజకీయ భావాలు, అభిప్రాయాలు తిరిగి జర్మనీలో తలెత్తుతున్నాయి. అతి మితవాద గ్రూపులు రాజకీయంగా బలాన్ని పుంజుకొంటున్నాయి. అతి మితవాద రాజకీయ పార్టీగా వున్న ఆల్టర్‌నేటివ్ ఫర్ జర్మనీ అనే రాజకీయ పార్టీ 2013 ఎన్నికలలో కేవలం 5% ఓట్లనే తెచ్చుకోగా క్రిందటి సంవత్సరం బుందర్ స్టాగ్‌కు జరిగిన ఎన్నికలలో 83 సీట్లు సంపాదించ గలిగింది. ఈ అతి మితవాద పార్టీ ప్రజల్లో ఏ రకంగా ప్రభావం సంపాదించు కొంటున్నదో చెప్పటానికి యిది ఒక సూచికగా వుంది.

మరోవైపు యీ తీవ్ర మితవాద శక్తులు జరుపుతున్న హింసాత్మక ఘటనలు కూడా పెరుగుతున్నాయి. 2019లో యీ శక్తులు, మధ్య - వామపక్ష స్థానిక రాజకీయనేత ఒకర్ని పశ్చిమ జర్మనీలో చంపివేశాయి. తూర్పు జర్మనీలోని హల్లేలో ఒక సైనగాగ్ (యూదుల ప్రార్థనా మందిరం)పై దాడి జరిపి, యిద్దరిని చంపివేశాయి. గత సంవత్సరం, జర్మనీ ప్రభుత్వం తమ కమేండో స్పెజియల్ కరాఫే అనే సైనిక విభాగంలోకి తీవ్రవాదులు చొరబడ్డారు అనే కారణంచేత, ఆ దళాన్ని పాక్షికంగా రద్దుచేసింది.

జర్మనీలో పనిచేసే రీచ్‌బర్గర్ లేదా సిటిజన్స్ ఆఫ్ రీచ్ అన్న తీవ్ర అతి మితవాద గ్రూపు, యుద్ధానంతర జర్మన్ రాజ్యాన్ని గుర్తించదు. అది అమెరికాలోని అతి మితవాద సమూహం అయిన క్యూ-ఏనన్ అనే గ్రూపు ప్రచారం చేసే, కుట్ర సిద్ధాంతాలతో ప్రేరేపితమైంది. జర్మనీలోని యూదు వ్యతిరేక తీవ్రవాద గ్రూపులన్నీ ఏకమై, సైనిక తిరుగుబాటు జరిపి ప్రభుత్వాన్ని వశపరచుకొనే యత్నంలో వున్నారని జర్మన్ ప్రభుత్వం భావిస్తోంది.

డిసెంబరు 7వ తేదీన జర్మన్ ప్రభుత్వం, అధికారంలో వున్న ఒక న్యాయమూర్తిని, ఒక మాజీ సైనిక అధికారినీ, ఒక మాజీ పోలీసు అధికారితోపాటు మరో 25 మంది వ్యక్తులను తీవ్రవాదులుగా అరెస్టు చేసింది. ఇలా అరెస్టుకాబడిన న్యాయమూర్తి బ్రైట్ ఎమ్. డబ్ల్యు, ఆల్టర్‌నేటివ్ ఫర్ జర్మనీ పార్టీకి చెందిన చట్ట నిర్మాత. అరెస్టయిన మాజీ సైనిక (పారాట్రూప్స్) కమేండర్ అయిన హెన్రిక్-XIII, ప్రిన్స్ రూస్, యూదు వ్యతిరేక నినాదాలు యిచ్చేవారి రింగ్ లీడర్. అతడు ఆధునిక జర్మన్ రిపబ్లిక్‌ను ఒకనాడు 'భ్రమ' అని పేర్కొన్నవాడు. అతడు సమాజంలో యూదు-వ్యతిరేక తీవ్రవాదాన్ని ప్రచారం చేస్తూ, ఒకనాటి జర్మన్ సామ్రాజ్యాన్ని కలగంటూ, కుట్ర సిద్ధాంతాలను ప్రచారం చేస్తూ, సాయుధంగా ప్రస్తుత జర్మన్ ప్రభుత్వాన్ని కూల్చాలనే సిద్ధాంతం కలవాడు.

ప్రపంచీకరణ అనంతర పరిణామంగా ప్రపంచమంతటా యీ తీవ్ర, అతి మితవాద రాజకీయాలు తలెత్తుతున్న దానిలో భాగంగానే, నేడు జర్మనీ దేశంలో కూడా, యీ తీవ్రవాద, అభివృద్ధి నిరోధక రాజకీయ బృందాలు రోజురోజుకూ బలం పుంజుకుంటూ, సమీప భవిష్యత్తులో ప్రపంచ ప్రజానీకానికి ప్రమాదకరంగా పరిణమించబోతున్నాయన్నదానికి, జర్మనీలోని తీవ్ర, అతి మితవాదుల అరెస్టులు ఒక సూచికగా వున్నాయి!

**(హిందూ పత్రిక
సంపాదకీయం ఆధారంగా)**

* * * * *